ఫేక్ వీడియోల వల్లే హెచ్‌సియు భూముల వివాదం

- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దుర్వినియోగం
- ఇది ప్రజాస్వామ్య వ్యవస్థలకు సవాల్
- ప్రముఖులు కూడా ఫేక్ వీడియోలు పోస్ట్ చేయడం బాధాకరం
- కోర్టుకు వాస్తవాలు చెప్పి విచారణ కోరాలి
- అధికారులతో సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ యూనివర్సిటీ భూములను లాక్కున్నట్లుగా సోషల్ మీడియా నెట్ వర్క్ కృత్రిమంగా వివాదం సృష్టించటం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. కంచె గచ్చిబౌలి భూములకు సంబంధించి కోర్టులో ఉన్న కేసులపై ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొంగులేటి, సిఎస్ శాంతికుమారి, డిజిపి జితేందర్, పిసిసిఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్, టిజిఐఐసి ఎండి విష్ణువర్ధన్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. కంచె గచ్చిబౌలి లోని సర్వే నెంబర్ 25లో ఉన్న భూముల్లో గత 25 ఏళ్లుగా ఎన్నో ప్రాజెక్టులు నిర్మించారు. ఐఎస్‌బి తో పాటు గచ్చిబౌలి స్టేడియం, ఐఐఐటి, ప్రవేటు బిల్డింగ్ లు, రెసిడెన్షియల్ అపార్టుమెంట్లు, హైదరాబాద్ యూనివర్సిటీ బిల్డింగ్‌లను నిర్మించారు. వాటిని నిర్మించేటప్పుడు ఎలాంటి వివాదాలు, ఆందోళనలు జరగలేదని అధికారులు ముఖ్యమంత్రికి దృష్టికి తీసుకు వచ్చారు. అప్పుడు వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ విధ్వంసం లాంటి వివాదాలు కూడా లేవన్నారు. అలాంటప్పుడు అదే సర్వే నెంబర్లోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని అభివద్ధి చేసేటప్పుడు ఎందుకు వివాదాస్పదమైందని సమావేశంలో చర్చ జరిగింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఉన్నవి లేనట్లు, లేనివి ఉన్నట్లుగా వీడియోలు, ఫొటోలు సష్టించి కొందరు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయటంతో ఈ వివాదం జాతీయ స్థాయిలో చర్చకు దారి తీసిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వాస్తవాలు వెల్లడించే లోగా అబద్దాలు సోషల్ మీడియాలో జాతీయ స్థాయిలో వైరల్ కావటం ప్రభుత్వానికి సవాలుగా మారిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏకంగా నెమళ్ళు ఏడ్చినట్లుగా ఆడియోలు, బుల్డోజర్లకు జింకలు గాయపడి పరుగులు తీస్తున్నట్లుగా ఫేక్ ఫొటోలు, వీడియోలు తయారు చేశారని పోలీసు అధికారులు సిఎంకు వివరించారు. వివిధ రంగాల్లో పేరొందిన ప్రముఖులు కూడా వాటినే నిజమని నమ్మి సోషల్ మీడియాలో పోస్టులు, వీడియోలు పెట్టడంతో అబద్ధాలకు ఆజ్యం పోసినట్లయిందని అన్నారు. ఏకంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, సోషల్ మీడియా ఇన్ ఫ్ల్యుయెన్సర్ ధ్రువ్ రాఠీ, సినీ ప్రముఖులు జాన్ అబ్రహం, దియా మీర్జా, రవీనా తండన్ లాంటి వాళ్లందరూ ఏఐ ద్వారా సష్టించిన ఫేక్ ఫొటోలు, వీడియోల పోస్టు చేసి సమాజానికి తప్పుడు సందేశం చేరవేశారని సమావేశంలో చర్చ జరిగింది. ఈ భూములపై మొట్ట మొదటగా ఫేక్ వీడియో పోస్ట్ చేసిన జర్నలిస్ట్ సుమిత్ జా కొద్ది సేపట్లోనే తన పోస్టును తొలిగించి క్షమాపణలు చెప్పారని, కానీ మిగతా ప్రముఖులెవరూ ఈ నిజాన్ని గుర్తించకుండా అదే ఫేక్ వీడియో ప్రచారం చేశారని అధికారులు అభిప్రాయపడ్డారు. కంచె గచ్చిబౌలిలో ఎఐ సృష్టించిన వివాదం ప్రజాస్వామ్య వ్యవస్థలకే పెను సవాలు విసిరిందని ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఇదే తీరుగా ఇండో పాక్, ఇండో చైనా సరిహద్దుల్లాంటి వివాదాలు, ఘర్షణలకు దారితీసే సున్నితమైన అంశాల్లో ఎఐతో ఫేక్ కంటెంట్ సష్టిస్తే భవిష్యత్తుల్లో యుద్ధాలు జరిగే ప్రమాదముంటుందని చర్చ జరిగింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా తయారు చేసే ఫేక్ వీడియోలు, ఫొటోలు కరోనా వైరస్ ను మించిన మహమ్మారిలాంటివని ఈ సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. సమాజాన్ని తప్పుదోవ పట్టించే ఎఐ ఫేక్ కంటెంట్ తయారీపై విచారణకు ఆదేశించేలా రాష్ట్ర ప్రభుత్వం తరపున కోర్టుకు విజ్ఞప్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా రాష్ట్రంలో సైబర్ క్రైమ్ విభాగాన్ని బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎఐ ఫేక్ కంటెంట్ ను పసిగట్టేలా అవసరమైన అధునాతన ఫోరెన్సిక్ హార్డ్ వేర్, సాఫ్ట్ వేర్ టూల్స్ను సమకూర్చుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకం : సిఎం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిఎం

స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధానమంత్రి డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకమనీ, దేశానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. శనివారం జగ్జీవన్‌రామ్ 118వ జయంతిని పురస్కరించుకుని బాబూజీ సేవలను సిఎం స్మరించుకున్నారు. పేదరికంలో జన్మించిన ఆయన అకుంఠిత దీక్షతో అత్యున్నత స్థానానికి ఎదిగారని గుర్తు చేశారు. జాతీయోద్యమంలో పాల్గొన్నారనీ, తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో మంత్రిగా సేవలు అందించారని.. కార్మిక సంక్షేమానికి పాటుపడ్డారన్నారని తెలిపారు. అంటరానితనం, కుల వివక్ష నిర్మూలనకు బాబూజీ పోరాడారనీ, దళితుల అభ్యున్నతికి పాటుపడ్డారని గుర్తు చేశారు. బాబూజీ స్ఫూర్తితో ప్రజా పాలన కొనసాగిస్తున్నామని, ఆయన ఆశయాలకు అనుగుణంగానే ప్రజా ప్రభుత్వం కుల గణన, బిసి రిజర్వేషన్ల పెంపు, ఎస్‌సి వర్గీకరణను అమలు చేసిందని ముఖ్యమంత్రి తెలిపారు. నివాళులర్పించిన వారిలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ మల్లు రవి, మాజీ ఎంపీలు వి హనుమంతరావు, అంజన్‌కుమార్ యాదవ్ ఉన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం

జగ్జీవన్‌రామ్ కృషి చరిత్రలో నిలిచిపోతుంది

- మహనీయులను యువత ఆదర్శంగా తీసుకోవాలి
- డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. యువత మహనీయులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో శనివారం డాక్టర్ బాబా జగ్జీవన్‌రామ్ 118వ జయంతి వేడుకలు నిర్వహించారు. రాజేంద్రనగర్ సర్కిల్ జయంతి ఉత్సవాల కమిటీ అధ్యక్షులు ఎడ్ల కాడి సూర్యం ఆధ్వర్యంలో ఆరాంఘర్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ హాజరయ్యారు. ముందుగా బాబు జగ్జీవన్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం జగ్జీవన్‌రామ్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. స్వతంత్ర సమర యోధుడని, కుల, రహిత సమాజం కోసం పాటుపడిన గొప్ప వ్యక్తి అన్నారు. అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్ అన్నారు. దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారని అన్నారు. దాదాపు 10సార్లు ఎంపీగా గెలిచారని గుర్తు చేశారు. కేంద్ర మంత్రిగా వివిధ శాఖల్లో పని చేశారన్నారు. వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు హరిత విప్లవం తీసుకొచ్చి రైతులకు ప్రత్యేక వెసులుబాటు ఇచ్చారన్నారు. పీఎఫ్ విధానం, పోస్ట్ ఆఫీస్ ఏర్పాట్లు, కార్మిక శాఖ మంత్రిగా కార్మికుల వేతనాల పెంపు, పని విధానం, లాంటి ఎన్నో సరికొత్త మార్పులు తీసుకొచ్చి తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారన్నారు. జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్ బాబు

పిల్లలకు ర్యాంకులే జీవితం కాదు

- ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మార్కులు, ర్యాంకులు మాత్రమే జీవితం కాదనీ, తమకు ఆసక్తి ఉన్న రంగంలో ప్రతిభ చూపేలా చిన్నారులను ప్రోత్సహించాలని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల.శ్రీధర్‌బాబు అన్నారు. హైదరాబాద్ సన్ సిటీలోని గ్లెన్డేల్ అకాడమీలో నిర్వహించిన "లీడర్‌షిప్‌డే-2025"కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు నాయకత్వ లక్షణాలను నేర్పించాలనీ, అప్పుడే సమాజాన్ని అర్థం చేసుకునే మంచి నాయకులు తయారవుతారని పేర్కొన్నారు. వ్యక్తిత్వ నిర్మాణంలో పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి చిన్నారిలో ఏదో ఒక టాలెంట్ ఉంటుందనీ, ఇతరులతో పోల్చి వారిపై ఒత్తిడి తేవొద్దని తల్లిదండ్రులకు సూచించారు. అబ్దుల్ కలాం మాటలను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థి దశలోనే గొప్ప లక్ష్యాన్ని ఎంచుకొని... దాన్ని సాకారం చేసుకునేందుకు నిరంతరం కృషి చేయాలని విద్యార్థులకు మార్గనిర్దేశకం చేశారు. టెక్నాలజీ రోజురోజుకీ కొత్త పుంతలు తరుణంలో వినూత్నంగా ఆలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్‌జీ డిప్యూటీ కంట్రీ డైరెక్టర్ అవీష్ సింగ్, గ్లెన్డేల్ గ్రూప్స్ డైరెక్టర్ మీనూ సలూజా, లైఫ్ కోచ్ అండ్ మెంటార్ డా.కన్నన్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయానికి కేంద్రం చేయూత

- సాంకేతికపరిజ్ఞానంతో ముందుకెళ్లాలి
- కేంద్ర మంత్రి జితేందర్‌సింగ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సేంద్రియ వ్యవసాయం చేసే రైతులకు కేంద్ర ప్రభుత్వం తరఫున సాంకేతికంగా.. ఆర్థికంగా చేయూతనందిస్తామని కేంద్ర సాంకేతిక, భూ విజ్ఞాన శాస్త్ర శాఖ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ తెలిపారు. వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని ముందుకెళ్లాలని సూచించారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలో ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి, సేంద్రియ రైతు సమ్మేళనం నిర్వహించారు. శనివారం ముగింపు కార్యక్రమానికి కేంద్ర మంత్రి హాజరయ్యారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య, విజయవాడ ఎమ్మెల్యే సుజనాచౌదరి, డాక్టర్ షేక్ ఎన్‌మీరాతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించే విధంగా పల్లె సృజన వారు స్టాల్స్ ఏర్పాటు చేయడం చాలా బాగుందన్నారు. రోజురోజుకూ ఎన్నో కొత్త రోగాలు వస్తున్నాయని, వీటిని కొంతమేరకైనా తగ్గించుకోవాలంటే సేంద్రియ ఎరువుల ద్వారా వ్యవసాయం చేసి ఆహార ఉత్పత్తులు పెంచాలని సూచించారు. పదేళ్లుగా సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేసే విధంగా ప్రధాని మోడీ అనేక కార్యక్రమాలు తీసుకొస్తున్నారని తెలిపారు. ఈ ప్రయత్నం నిరంతరం కొనసాగిస్తామన్నారు. రైతులు శాస్త్రీయ టెక్నాలజీ సహాయంతో వ్యవసాయం చేస్తే ఉత్పత్తులు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలు, జిల్లాల్లో సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తే అందరికీ మంచి జరుగుతుందన్నారు. మనదేశంలో వ్యవసాయమే జీవనాధారం అని చెప్పారు. ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ చేస్తున్న కృషిని అభినందనీయమన్నారు. విజయవాడ ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ.. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అనుసంధానం చేసుకొని సేంద్రియ వ్యవసాయానికి సహకరించాలని కోరారు. ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. బయోగ్యాస్ ప్లాంటు ప్రస్తుతం ప్రజలకు ఎంతో అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ చైర్మెన్ వెంకటేశ్వర్లు, కన్వీనర్ మాణిక్యరెడ్డి, సైంటిస్టులు, వివిధ పార్టీల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, రైతులు

ఫార్మా భూముల్లో ఫెన్సింగ్ ఆపాలి

- ప్రభుత్వం ఫార్మా రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి
- మేడిపల్లిలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఫార్మాసిటీ భూముల్లో చేపట్టిన ఫెన్సింగ్‌ను వెంటనే ఆపి, ఎన్నికల ముందు రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు పి.అంజయ్య డిమాండ్ చేశారు. శనివారం రంగారెడ్డి జిల్లా యాచారం మండల పరిధిలోని మేడిపల్లి నక్కర్తలో ఫార్మా భూముల విషయంలో సిపిఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బలవంతంగా ఫార్మాసిటీ భూముల్లో ఏర్పాటు చేస్తున్న ఫెన్సింగ్‌ను ఆపాలని డిమాండ్ చేశారు. కోర్ట్ ఆర్డర్‌ను ధిక్కరించి మేడిపల్లిలో పెద్ద ఎత్తున పోలీసు బలగాలను దింపి ఫార్మా భూములకు హద్దు రాళ్ల ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అడ్డుకున్న రైతులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేస్తున్నారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బలవంతంగా రెండు మండలాల్లో భూసేకరణ చేపట్టిందని గుర్తు చేశారు. ఎన్నికల ముందు ఫార్మాసిటీని రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు మాట మార్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి ఫార్మా రైతులకు ఎకరాకు 121 గజాల ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. 2,800 ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో నుంచి తొలగించాలని అధికారులను కోరారు. వారికి ఆ భూమిపై పూర్తి హక్కులు కల్పించాలన్నారు. ఫార్మాసిటీ బాధిత రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని మేడిపల్లి, కుర్మిద్దలో తమ పార్టీ ఇంటింటి సర్వే నిర్వహించిందన్నారు. వారి సమస్యల పరిష్కారానికి జీపు జాతను కూడా చేపట్టిందని చెప్పారు. సమస్యలు పరిష్కరించే వరకూ తమ పార్టీ రైతుల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆలంపల్లి జంగయ్య, ఎండి జహంగీర్, ఆలంపల్లి యాదయ్య, వడ్డెమోని భూషణ్, ఆలంపల్లి పెంటయ్య, గడ్డం యాదయ్య పాల్గొన్నారు

డ్రగ్స్ అమ్ముతున్న ముగ్గురు నైజీరియన్ల అరెస్ట్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

చాలా కాలంగా డ్రగ్స్ అమ్ముతున్న ముగ్గురు నైజీరియన్లను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. నార్కోటెక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపిన వివరాల ప్రకారం.. సన్ సిటీలో డ్రగ్స్ అమ్ముతున్న ముగ్గురు నైజీరియన్లను నార్కోటిక్ బ్యూరో సిబ్బంది రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మూడు నెలలుగా వీరిపై నిఘా పెట్టి శనివారం అదుపులోకి తీసుకున్నారు. వీరు భారత్‌లోనే కాకుండా అమెరికాలో కూడా డ్రగ్స్ అమ్ముతున్నారు. ఈ డ్రగ్స్ వ్యాపారం పూర్తిగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. కస్టమర్లకు డ్రగ్స్ సరఫరా చేయడానికి యువతులను నియమించుకున్నారు. టోలిచౌకిలో ఒక యువతి డ్రగ్ సరఫరా చేస్తుండగా పట్టుకున్నారు. అమెరికాలో దీనికోసం 15 మంది యువకులను నియమించుకున్నారు. భారత్ నుంచి డబ్బులు అమెరికా అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ అయిన తర్వాత అక్కడ నుంచి హవాలా రూపంలో నైజీరియాకు వెళ్తున్నాయి. నైజీరియన్స్ విసిటింగ్ వీసా మీద భారత్‌లోకి ప్రవేశించి, ఈ వ్యాపారం చేస్తున్నట్టు గుర్తించారు. వీరి నుంచి రూ.12 లక్షల 50 వేల విలువైన డ్రగ్స్, కారును స్వాధీనం చేసుకున్నారు. స్థానికులు ఎవరైనా ఇలాంటి వారికి ఇల్లు అద్దెకిస్తే .. వారి పాస్‌పోర్టు, వీసా జిరాక్స్ కాపీలు తీసుకోవాలని, అదేవిధంగా లోకల్ పోలీసులకు సమాచారం అందించాలని నార్కోటెక్ బ్యూరో డైరెక్టర్ సూచించారు. వీసా గడువు అయిపోయినా.. ఇక్కడే ఉంటే తమకు తెలియజేయాలన్నారు.

కొత్తగూడెంలో ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ

- ముఖ్యమంత్రి ఆమోదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయాన్ని మంజూరు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారు. మైనింగ్ కళాశాలను అప్ గ్రేడ్ చేస్తూ యూనివర్సిటీగా మారుస్తున్నట్టు ప్రకటించారు. సీఎం ప్రకటనతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శ్రమ ఫలించింది. సహజ వనరులు, మెరుగైన అవకాశాలు ఉన్న మైనింగ్ కళాశాలను ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంగా అప్ గ్రేడ్ చేయాలని మంత్రి తుమ్మల పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రాలు అందచేసిన విషయం తెలిసిందే. మంత్రి తుమ్మల విజ్ఞప్తి మేరకు సిఎం సానుకూలంగా స్పందించి యూనివర్సిటీని మంజూరు చేస్తూ ప్రకటన జారీ చేశారు. దీంతో మంత్రి సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. సహజ వనరులు, మినరల్స్ ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయం ఏర్పాటుతో అంతర్జాతీయ ఖ్యాతి లభించనుంది. దేశంలోనే మొట్టమొదటి ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని కొత్తగూడెం జిల్లాలో మంజూరు చేయడం ఉమ్మడి జిల్లాకు లభించిన గొప్ప గౌరవంగా చెప్పొచ్చు.

300 ఎకరాల్లో విశ్వవిద్యాలయం

సింగరేణి స్కూల్ ఆఫ్ మైన్స్ దేశంలోనే ఎక్కడా లేనివిధంగా 300 ఎకరాల్లో విశ్వవిద్యాలయం రూపుదిద్దుకోనుంది. అత్యున్నత ప్రమాణాలతో వేలాది మందికి విద్య, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా మారనుంది. మైనింగ్ కళాశాలను విశ్వవిద్యాలయంగా మార్చడం ద్వారా వేలాదిమంది యువ శాస్త్రవేత్తల ఇక్కడి నుంచే దేశ భవిష్యత్‌కు బాటలు వేయనున్నారు.

అంబేద్కర్ వర్సిటీలో సామాజిక సాధికారత ఉత్సవాలు

జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించిన విసి ఘంటా చక్రపాణి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (బిఆర్ఎఒయు)లో సామాజిక సాధికార ఉత్సవాలను నిర్వహించారు. శనివారం హైదరాబాద్‌లోని అంబేద్కర్ వర్సిటీలో మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి విసి ఘంటా చక్రపాణి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అణగారిన ప్రజల అభ్యున్నతికి, విద్యా వికాసానికి, దేశ సమైక్యతకు, సమగ్రతకు దిశా నిర్దేశం చేసిన మహనీయుల జయంతిని పురస్కరించుకుని అంబేద్కర్ వర్సిటీలో సామాజిక సాధికారత వారోత్సవాలను నిర్వహించాలని నిర్ణయించామన్నారు. బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలతో మొదలై భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవ కార్యక్రమాలతో ముగుస్తాయని వివరించారు. అసమానతలకు నిలయంగా ఉన్న దేశంలో సమాన అవకాశాల కోసం అణగారిన వర్గాల సాధికారత కోసం కృషి చేసిన మహనీయుల్లో మహాత్మా జ్యోతిబా పూలే, బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అగ్రగణ్యులని అన్నారు. సామాజిక న్యాయాన్ని, సాధికారతను పూలే ఒక ఉద్యమంగా మొదలుపెడితే అంబేద్కర్ దాన్ని రాజ్యాంగబద్ధం చేసి ఈ దేశ మౌలిక స్వరూపాన్ని మార్చే ప్రయత్నం చేశారని చెప్పారు. చదువొక్కటే సాధికారతకు మూలమని అంబేద్కర్ స్పష్టంగా చెప్పారని గుర్తు చేశారు. ఈ ఉత్సవాల్లో భాగంగా మహనీయుల జయంతులు, ఉపన్యాసాలు, చర్చాగోష్ఠులు, సదస్సులు, సాహిత్య సమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమాలుంటాయని వివరించారు. ఈనెల ఎనిమిదిన జగ్జీవన్‌రామ్ జీవితం దేశాభివృద్ధికి చేసిన కృషిపై ఉపన్యాసం, 11న పూలే జయంతి సందర్భంగా బీసీ కులగణన సాధికారతపై ఉపన్యాసం ఉంటుందని చెప్పారు. 12న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అండ్ ఇంటర్ సెక్షనాలిటీస్ అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నామనీ, అదేరోజు సాయంత్రం అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం గ్లోబల్ అల్యూమ్ని ఉంటుందని అన్నారు. 13న రాజ్యాంగ పీఠిక పఠనం, సామాజిక సమానత్వం-సమ్మిళితం అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం ఉంటుందని చెప్పారు. 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా స్మారకోపన్యాసం ఉంటుందనీ, ప్రధాన వక్తగా కత్తి పద్మారావు హాజరవుతారనీ, సాయంత్రం గోరేటి వెంకన్న ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలుంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ పుష్పా చక్రపాణి, రిజిస్ట్రార్ ఎల్వీకే రెడ్డి, పలువురు డైరెక్టర్లు , డీన్‌లు, సిబ్బంది, ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

In the Court of the VI Additional District Judge, Kakinada
O.S. No. 13/2024

Between:
Motapothu Venkata Rao ...*Plaintiff*
AND
Navya Jonnala and 2 Others ...*Defendants*

To Defendants:
D-1: Navya Jonnala, D/o. late Hari Hara Rao, Hindu, aged 42 years, Flat No. 346A, D.No. 23-118/21/3/D, Telecom Colony, Kanaji guda, Tirumalagiri, Hyderabad, Telangana State.
D-2: Sampath Jonnala, W/o. late hari Hara Rao, Hindu, aged 66 years, Flat No. 346A, D.No. 23-118/21/3/D, Telecom Colony, Kanaji guda, Tirumalagiri, Hyderabad, Telangana State.
D-3: Mohana Lakshmi Jonnala, D/o. late hari Hara Rao, Hindu, aged 39 years, Flat No. 346A, D.No. 23-118/21/3/D, Telecom Colony, Kanaji guda, Tirumalagiri, Hyderabad, Telangana State.

పై నెంబరు దావాలో 1వ టు 3వ ప్రతివాద్లు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను, మీరు తీసుకొనకుండా ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 25-04-2025 సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం 10.30 ని॥లకు** పై శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల పై దావా మీ పరోక్షమందు విచారించి తీర్మానించడమగును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

బోయనపల్లి రాధాకృష్ణ
ఎ.అనిల్‌కుమార్ రాజా, అడ్వకేట్స్
డో.నెం. 6-1-9, జవహర్ వీధి
కాకినాడ, కాకినాడ జిల్లా
సెల్: 9440323951

టన్నెల్‌లో వెంటిలేషన్ పనులు కొనసాగింపు

మట్టి తవ్వకాలు, డీ-వాటరింగ్ ప్రక్రియ వేగవంతం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్ఎల్‌బీసీ, టన్నెల్‌లోని ఇన్లెట్ 1 ఆఫీస్ వద్ద సొరంగంలో కొనసాగుతున్న సహాయక చర్యలను ప్రత్యేక అధికారి శివశంకర్ సహాయక బృందాల ఉన్నతాధికారులతో కలిసి పర్యవేక్షించారు. సొరంగలో జరిగిన ప్రమాదంలో చిక్కుకున్న వారి ఆచూకీ తెలుసుకునేందుకు చేపడుతున్న సహాయక చర్యలను వేగవంతం చేసినట్టు తెలిపారు. టన్నెల్ లోపల స్టీల్ తొలగింపు పనులు, మట్టి తవ్వకాలు, ఊట నీటిని బయటకు తరలించే ప్రక్రియ, కన్వేయర్ బెల్ట్ ద్వారా మట్టిని బయటకు చేరవేసే ప్రక్రియ సమాంతరంగా జరుగుతున్నట్టు శివశంకర్ వివరించారు. నీటి పారుదల శాఖ అధికారులు నిరంతరం పరిస్థితులను గమనిస్తూ, సహాయక బృందాల ఉన్నతాధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నారన్నారు. శనివారం మట్టి తవ్వకాలకు అనుగుణంగా వెంటిలేషన్ ప్రక్రియను ముందుకు కొనసాగిస్తున్నట్టు వివరించారు. ఈ సమావేశంలో ఆర్మీ అధికారులు వికాస్ సింగ్, విజయ్ కుమార్, జేపీ కంపెనీ సీనియర్ ప్రాజెక్టు ఇంజినీర్ సంజయ్ కుమార్ సింగ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, ఎస్‌డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్ రెడ్డి, హైడ్రా అధికారి, దక్షిణ మధ్య రైల్వే అధికారి రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో మహిళలపై పెరిగిపోతున్న లైంగిక దాడులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైళ్లల్లో మహిళలపై రోజురోజుకి లైంగిక దాడులు పెరిగిపోతున్నాయనీ, దాడికి పాల్పడిన నిందితునిపై 2016 ఆర్‌పీడీ చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని ఎన్‌పీఆర్‌డీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు టి వరమ్మ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య, కోశాధికారి ఆర్ వెంకటేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. రక్సేల్ - సికింద్రాబాద్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో అర్ధరాత్రి వాష్ రూమ్‌కు వెళ్లిన ఆటిజం కలిగిన(వికలాంగురాలు) బాలికపై లైంగిక దాడి చేసిన నిందితుణ్ణి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రైళ్లలో వరుసగా మహిళలపై లైంగిక దాడులు, పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మార్చి నెలలో మేడ్చల్‌కు వెళ్లే ఎంఎంటీఎస్ రైలులో బాలికపై లైంగిక దాడి యత్నం ఘటన మరువకముందే మళ్లీ ఆటిజం కలిగిన వికలాంగురాలిపై లైంగిక దాడి జరిగిందని తెలిపారు. రైలులో మహిళలకు భద్రత లేదనే దానికి ఈ మధ్యలో జరిగిన ఘటనలే నిదర్శనమని పేర్కొన్నారు. రైల్వే భద్రత వైఫల్యం మూలంగానే ఇలాంటి ఘటనలు జరుగుతున్నవనీ, మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు.

సంప్రదాయ విత్తనాన్ని కాపాడుకోవాలి

- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్థానిక సంప్రదాయ విత్తనాన్ని కాపాడుకుంటూనే, సుస్థిర వ్యవసాయాన్ని కొనసాగించే పద్ధతులను అన్వేషించాలని శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చెప్పారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం అన్మాస్‌పల్లి గ్రామంలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ నిర్వహిస్తున్న విత్తన పండుగ శనివారం రెండో రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమానికి గుత్తా సుఖేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. వ్యవసాయంలో జీవనోపాధి, ఆరోగ్యం ఉంటుందని యువతకు అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం యువతని ఆకట్టుకోవాలన్నారు. వాళ్లకు నమ్మకం కలిగిస్తేనే మనం వ్యవసాయాన్ని కాపాడుకోగలుగుతామని చెప్పారు. దానికి స్వదేశీ పద్ధతులు, విత్తనం మంచిదని, అయితే ప్రపంచ పోటీని కూడా తట్టుకునేలా వ్యవసాయ విధానాలను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ సందర్భంగా ఆయన విత్తనాల స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం లైబ్రరీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫార్మర్ కమిషన్ కెబిఎన్ రెడ్డి, సిజిఆర్ వ్యవస్థాపకులు లీల లక్ష్మారెడ్డి, దొంతి నరసింహారెడ్డి, వ్యవసాయ నిపుణులు సునంద, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

In the Court of the VI Additional District Judge, Kakinada
I.A. No. 126/2024 in
O.S. No. 13/2024

Between:
Motapothu Venkata Rao ...*Petitioner/ Plaintiff*
AND
Navya Jonnala and 2 Others ...*Respondents/ Defendants*

To Respondents:
R-1: Navya Jonnala, D/o. late Hari Hara Rao, Hindu, aged 42 years, Flat No. 346A, D.No. 23-118/21/3/D, Telecom Colony, Kanaji guda, Tirumalagiri, Hyderabad, Telangana State.
R-2: Sampath Jonnala, W/o. late hari Hara Rao, Hindu, aged 66 years, Flat No. 346A, D.No. 23-118/21/3/D, Telecom Colony, Kanaji guda, Tirumalagiri, Hyderabad, Telangana State.
R-3: Mohana Lakshmi Jonnala, D/o. late hari Hara Rao, Hindu, aged 39 years, Flat No. 346A, D.No. 23-118/21/3/D, Telecom Colony, Kanaji guda, Tirumalagiri, Hyderabad, Telangana State.

పై నెంబరు పిటిషన్‌లో 1వ టు 3వ రెస్పాండెంట్స్ అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను, మీరు తీసుకొనకుండా ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 25-04-2025 సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం 10.30 ని॥లకు** పై శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల పై పిటిషన్ మీ పరోక్షమందు విచారించి తీర్మానించడమగును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

బోయనపల్లి రాధాకృష్ణ
ఎ.అనిల్‌కుమార్ రాజా, అడ్వకేట్స్
డో.నెం. 6-1-9, జవహర్ వీధి
కాకినాడ, కాకినాడ జిల్లా
సెల్: 9440323951

ఉపాధి కూలి పెంపు రూ.7 మాత్రమే..

- 20 ఏళ్లలో ధరల పెరుగుదల కొండంత
- ఇజిఎస్ వేతనం పెరిగింది రూ.219 మాత్రమే
- సగటు పని దినాలు 44 రోజులే.. 100 రోజుల పని అందని ద్రాక్షే
- నీళ్లు, నీడలేదు.. రూ.5 భత్యమూ లేదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామీణ పేదలకు పని గ్యారంటీ కల్పించాలన్న లక్ష్యంతో అమలు చేస్తున్న మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రం నీరుగారుస్తోంది. ఏటా బడ్జెట్‌లో అవసరమైన నిధులివ్వకుండా కోతలు పెడుతోంది. కూలీలకు ఇచ్చే వేతనం 20 ఏండ్లుగా రూ.300కు మించలేదు. కానీ..! ధరల పెరుగుదల మాత్రం కొండంతలా ఉండటంతో కూలీలు సప్పిడి మెతుకులకు సైతం నోచుకోవట్లేదు. మండుటెండల్లో మగ్గుతూ కష్టం చేస్తున్న కూలీలకు నాలుగేండ్లుగా అదనపు భత్యం, నీడ, నీళ్ల భత్యం ఇవ్వట్లేదు. ఎంత కష్టపడినా వేతనం రూ.180 దాటట్లేదు. ఏడాదిలో వంద రోజుల పని దినాలు కల్పించాల్సి ఉన్నా సగటున 44 పనిదినాలు కూడా కల్పించని పరిస్థితి. ఇటీవల కేంద్రం ఉపాధి కూలీల కనీస వేతనం రూ.7 పెంచి పండగ చేసుకోండంటూ ఊదరకొట్టింది. కష్టజీవులు, అందులో గ్రామీణ పేదల పొట్టగొడుతూ కేంద్రం యాక్టీవ్ జాబ్‌కార్డుల పేరిట లక్షలాది మంది పేర్లను తొలగిస్తోంది. వేతన బకాయిల్ని ఇవ్వకుండా తిప్పలు పెడుతోంది.

2005లో ఎన్‌ఆర్‌ఈజీఏగా ఏర్పడి 2006లో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏగా మార్పు చేయబడిన జాతీయ ఉపాధి హామీ చట్టం అమల్లో పాలకులు అనేక ఆటంకాలను సృష్టిస్తున్నారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ ఇతర సంక్షేమ పథకాలంటిది కాదు. ఇది అత్యున్నతమైన పార్లమెంట్ చేసిన చట్టం. ఆ చట్టానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తరచూ తూట్లు పొడుస్తోంది. కేంద్రం ఏటేటా బడ్జెట్‌లో నిధుల కేటాయింపుల్ని తగ్గించడం వల్ల తెలంగాణలోని గ్రామీణ పేదలకు సరిపడా పని దినాల్ని కల్పించలేకపోతున్నారు. అదనంగా పని దినాలు కల్పిస్తున్న తెలంగాణకు కేంద్రం ఆ మేరకు నిధులివ్వకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం సైతం చేతులెత్తేస్తోంది. రాష్ట్రంలో 55 లక్షల వరకు జాబ్‌కార్డులున్నాయి. జాబ్‌కార్డుల్లో నమోదైన పేదలంతా ఏడాదిలో పది నుంచి వంద రోజుల వరకు తమ అవసరాలు, వీలును బట్టి పని చేసుకుంటున్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగాక కూలీలకు గ్రామాల్లో పనుల్లేకుండా పోతున్నాయి. ఉపాధి హామీ పనులు చేయడం ద్వారా పొట్టపోసుకునే కుటుంబాలు లక్షల్లోనే ఉన్నాయి. పెరిగిన అవసరాల రీత్యా 100 రోజు పని దినాల్ని 200 రోజులకు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఉపాధి కూలీ వేతనం రూ.7 పెంపు

జాతీయ ఉపాధి హామీలో పని చేసే కూలీలకు రోజువారి వేతనాన్ని ఇటీవల కేంద్రం పెంచింది. వేతనం పెంపుదల అంటే అది వందల్లో ఉంటుందని ఆశపడ్డ కూలీలకు తీవ్ర నిరాశే మిగిలింది. ఇప్పటి వరకు రూ.300గా ఉన్న వేతనాన్ని 2025-26 ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోని ఏప్రిల్ నుంచి రూ.307 చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేశారు. చట్టం అమల్లోకి వచ్చిన 2005లో ఉపాధి కూలి రోజు వేతనం రూ.87.50 ఉండేది. ఈ 20 ఏండ్లలో కేంద్రం మాత్రం కేవలం రూ.219.50 మాత్రమే పెంచింది. ఈ రెండు దశాబ్దాల కాలంలో నిత్యవసరాలు, ఇతర ధరలు మాత్రం కొండంతగా పెరిగిపోయాయి. ధరల భారాలు మోయలేని పేదలు పచ్చడి మెతుకులకు కూడా నోచుకోవట్లేదు. కేంద్రం నిర్ణయించిన రూ.300 వేతనం రాష్ట్రంలోని ఏ ఉపాధి కూలికి కూడా చెల్లించిన దాఖలాల్లేవు. కూలీలు ఎంత పని చేసినా సగటు వేతనం రూ.180 నుంచి 200కు మించడం లేదు. రోజు వేతనం రూ.7 పెంచడం వల్ల కూలీలకు కనీసం సింగిల్ టీ కూడా తాగేందుకు సరిపోని పరిస్థితి. ఇక ఉప్పు, పప్పు, బియ్యం, నూనెలు కొనే పరిస్థితి ఏముంటదని పలువురు కూలీలు వాపోతున్నారు. రోజు వేతనం రూ.600 చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

నాలుగేళ్లుగా అదనపు భత్యం బంద్

ఉపాధి హామీ కింద వేసవి కాలంలో చేసే పనుల్ని బట్టి నిర్ణయించిన వేతనంతో పాటు అదనపు భత్యం కూడా చెల్లించాలి. ఎండల తీవ్రత వల్ల భూమి వేడెక్కిపోతుంది. పొద్దస్తం పని చేయలేని పరిస్థితి ఉంటున్నందున అదనపు భత్యం చెల్లించాల్సి ఉంది. కేంద్రం మాత్రం నాలుగేండ్లుగా ఉపాధి కూలీలకు వేసవిలో ఇవ్వాల్సిన అదనపు భత్యాన్ని బంద్ చేసింది. మార్చి నెలలో 20 శాతం, ఏప్రిల్‌లో 25 శాతం, మేలో 30 శాతం చొప్పున అదనపు భత్యం కూలీలకు చెల్లించాలని చట్టం చెబుతోంది. గతంలో రాగాస్ సాఫ్ట్‌వేర్ ద్వారా నమోదు చేసే సమయంలోనే అదనపు చెల్లింపులు నమోదయ్యేది. ప్రస్తుతం ఎన్ఐసీ(నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్) సాఫ్ట్‌వేర్ వాడుతుండటం, కేంద్రం నేరుగా ఈ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి వినియోగిస్తున్నందున అదనపు కూలి చెల్లింపుల నమోదుకు అవకాశంలేకుండా చేశారు. ఎండాకాలంలో చేసే డైవర్షన్ డ్రైన్, రాళ్ల కట్టలు, ఫీడర్ చానల్, ఎంఐ సంపులు, మేలక, గొర్ల షెడ్లు, కోళ్లఫారాల నిర్మాణం, ఫామ్‌పాండ్, ఫార్మేషన్ రోడ్ల పనులన్నీ కష్టతరమైనవే. ఎండా కాలంలో మట్టి తవ్వకం కష్టమవుతున్నందున కూలి గిట్టదని అదనపు భత్యం ఇవ్వాలని చట్టం చెప్పినా కేంద్రం మాత్రం నిరాకరిస్తుంది.

ఏటేటా నిధుల్లో కోత పెడుతున్న కేంద్రం

దేశంలో అర్హులైన కూలీలందరికీ (కేంద్రం చెబుతున్న యాక్టీవ్ హౌస్‌హోల్డ్స్) ఎన్‌ఆర్‌ఈజీఏలో రూపొందించిన ప్రకారం ఒక ఏడాదిలో 100 రోజుల ఉపాధి కల్పించాలంటే రూ.3 లక్షల కోట్ల మేరకు బడ్జెట్ అవసరముంటదని అంచనా. కానీ.. 2024-25లో కేంద్రం మాత్రం రూ.86 వేల కోట్లు మాత్రమే కేటాయించింది. మార్చిలో పెట్టిన ఈ ఏడాది బడ్జెట్‌లోనూ పాత నిధులు రూ.86 వేల కోట్లనే విదిల్చింది. 2023-24లో రూ.60 వేల కోట్లు, 2022-23, 2021-22 రెండు బడ్జెట్లలోనూ రూ.73 వేల కోట్లు కేటాయించింది. అంతకు ముందు 2020-21లో రూ.61,500 కోట్లు, 2019-20, 2018-19 బడ్జెట్‌లోనూ రూ.60 వేల కోట్ల నిధుల్ని మాత్రమే కేటాయించింది. తెలంగాణ రాష్ట్రానికి 2025-26 బడ్జెట్‌లో కేవలం రూ.4416 కోట్లను మాత్రమే కేటాయించింది. కూలీలకు అధిక పని దినాలు కల్పించేందుకు తెలంగాణకు కేంద్రం అవసరమైన నిధులివ్వకపోవడంతో రాష్ట్రంలో సగటు పని దినాలు 44 నుంచి 56 రోజులకే పరిమితం చేస్తున్నారు.

ఉపాధి వేతనం రూ.600 ఇవ్వాలి: ఎం.నర్సింహులు, వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు

ఇజిఎస్‌లో పనిచేసే కూలీలకు రూ.600 వేతనం ఇవ్వాలి. రోజంతా పనిచేసినా ప్రస్తుతం రూ.150-200లకు మించట్లేదు. ఉపాధి పని దినాల్ని కూడా 200 రోజులకు పెంచాలి. కేంద్రం నిధులివ్వకపోవడం వల్ల పని దినాలు తగ్గిస్తున్నారు. తక్కువ వేతనం ఇస్తున్నారు. రాష్ట్ర అవసరాల మేరకు బడ్జెట్ ఇవ్వాలి. కూలీలు ఆరు రోజుల పని చేస్తే కేవలం నాలుగైదు రోజులకే హాజరు పడుతుంది. వేసవి అదనపు భత్యం ఇవ్వాలి. నీడ, నీళ్ల సదుపాయం ఇవ్వట్లేదు. అందు కోసం ఇవ్వాల్సిన రూ.5 కూడా ఇవ్వట్లేదు. బకాయి వేతనాల్ని వెంటనే చెల్లించాలి.

రైలు కిందపడి యువకుని ఆత్మహత్య

- క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని మనస్తాపం..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్ ఆడి డబ్బులు పోగొట్టుకున్న ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుచిత్రలోని బీహెచ్ఈఎల్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న రాజ్వీర్ సింగ్ ఠాకూర్(25) ప్రయివేటు ఉద్యోగి. అతను క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్ ఆడి డబ్బులు పోగొట్టుకున్నాడు. ఈ క్రమంలో ఇతరుల వద్ద అప్పులు చేశాడు. అలాగే, మద్యానికి బానిసైన రాజ్వీర్‌సింగ్ ఠాకూర్ అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురయ్యాడు. శనివారం తెల్లవారుజామున సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలి

పునరావాసం కల్పిస్తాం

- లొంగిపోయిన వారికి మల్టీజోన్-1 ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలని, పోలీసుల ఎదుట లొంగిపోయిన వారికి ప్రభుత్వం పునరావాసం కల్పిస్తుందని మల్టీ జోన్-1 ఐజిపి (ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్) చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. భద్రాద్రి జిల్లాకు చెందిన 81 మంది, ములుగు జిల్లాకు చెందిన ఐదుగురు మావోయిస్టు సభ్యులు శనివారం ఆయా జిల్లాల పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా హేమచంద్రపురం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో విలేకర్ల సమావేశంలో ఐజీ మాట్లాడుతూ.. లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం కింద చెక్కులు పంపిణీ చేసినట్టు తెలిపారు. మావోయిస్టులు వారి ఉనికి చాటుకునేందుకు అమాయకులైన కొంత మందిని టార్గెట్ చేయడం సరికాదన్నారు. చిన్న వయసులో ఉన్న వారికి మాయమాటలు చెప్పి దళంలోకి తీసుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికే మావోయిస్టుల ఉనికి పెద్దఎత్తున తగ్గిపోయిందన్నారు. అనేక మంది దళాల్లో వివిధ హోదాల్లో పనిచేసిన నాయకులు, దళ సభ్యులు లొంగిపోతున్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ ఏడాది 224 మంది మావోయిస్టులు లొంగిపోయారని, వారిలో భద్రాద్రి జిల్లాకు చెందిన 203 మంది, ములుగు జిల్లాకు చెందిన 21 మంది ఉన్నట్టు తెలిపారు. శనివారం 86 మంది లొంగిపోగా, వారిలో 26 మంది మహిళలు, 60 మంది పురుషులు ఉన్నారని తెలిపారు. ఇందులో నలుగురు ఏసీఎంలు ఉన్నారని, వారికి ఒక్కొక్కరికి రూ.4 లక్షలు, ఐదుగురికి రూ.5 లక్షల చొప్పున, సభ్యులకు రూ.25 వేల చొప్పున పునరావాసం కింద చెక్కులు అందజేసినట్టు వివరించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో మందు పాతరలు పేలి అనేక మంది సామాన్య ప్రజలు చనిపోయారని అన్నారు. మందు పాతరలను గుర్తించేందుకు ప్రత్యేక టీములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చర్ల పరిసర ప్రాంతంలోని పూసుగుప్ప వద్ద బాంబును గుర్తించి నిర్వీర్యం చేశామన్నారు. తెలంగాణ లో అండర్ గ్రౌండ్‌లో సుమారు 95 మంది మాత్రమే మావోయిస్టులు ఉండి ఉంటారని అభిప్రాయ పడ్డారు. వారితో చర్చించి ప్రజాజీవనంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ములుగు ఏఎస్పీ శివమ్ ఉపాధ్యాయ, ఖమ్మం ప్రొహిబిషన్ ఐపీఎస్ అధికారి రుత్విక్‌సాయి కొట్టే, 141 బెటాలియన్ కమాండెంట్ కమల్ వీర్, 81 బెటాలియన్ కమాండెంట్ ప్రీత, హిమాన్షు పాల్గొన్నారు.

పోలీసులకు లొంగిపోయిన మావోయిస్టులతో ఐజిపి

తెలంగాణలో పెట్టుబడులను ప్రోత్సహించండి

- రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సహకారాలు అందిస్తుంది
- లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాల ప్రతినిధులకు మంత్రి శ్రీధర్ విజ్ఞప్తి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణలో ఉన్న అనుకూలతలను వివరించి పెట్టుబడులు పెట్టేలా స్థానిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాల అధికార ప్రతినిధులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. శనివారం బంజారాహిల్స్ పార్క్ హయత్‌లో గ్లోబల్ ఇండియా బిజినెస్ ఫోరం(జీఐబీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన "ఇండియా-లాటిన్ అమెరికా, కరీబియన్ కంట్రీస్ బిజినెస్ కాంక్లేవ్" రెండో ఎడిషన్‌కు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలు, ప్రభుత్వం తరఫున పారిశ్రామికవేత్తలకు అందించే ప్రోత్సాహకాలను వివరించారు. వివిధ దేశాల ఉత్పత్తులపై సుంకాలను విధిస్తూ అమెరికా అధ్యక్షులు ట్రంప్ తీసుకున్న నిర్ణయం మనకు మేలు చేస్తుందని అభిప్రాయపడ్డారు. రాబోయే రోజుల్లో దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. జహీరాబాద్ నిమ్జ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆరు అంతర్జాతీయ సంస్థలు ముందుకొచ్చాయనీ, వీటిలో మూడు కొరియా కంపెనీలున్నాయని గుర్తు చేశారు. రాష్ట్రంలోని టైర్ 2,3 నగరాలు, పట్టణాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసేలా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఆగ్రో ప్రాసెసింగ్ రంగాన్ని ప్రోత్సహించి అన్నదాతలను వ్యాపారవేత్తలుగా తీర్చి దిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిఐబిఎఫ్ ప్రతినిధులు జోషి, చక్రవర్తి, డా.సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టానికి నిధుల కోత

- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఉపాధి హామీ చట్టానికి నిధుల కోత పెట్టి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులకు అన్యాయం చేస్తోందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని చింతగూడెం గ్రామంలో ఉపాధి హామీ కార్మికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ కార్మికులు పనిచేస్తున్న స్థలంలో మంచినీటి సౌకర్యం లేదన్నారు. ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఏర్పాటు చేయాలన్నారు. పనులు చేసిన ఉపాధి హామీ కార్మికులకు వెంటనే కూలి డబ్బులు చెల్లించాలన్నారు. బిజెపి ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి యత్నిస్తోందన్నారు. ఉపాధి హామీ చట్టంతో భూమిలేని నిరుపేదలు, కార్మికులకు ఎంతగానో ఉపయోగమని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కనికరపు అశోక్, నాయకులు అంబటి లక్ష్మణ్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాధిక, పోశమల్లు పాల్గొన్నారు.

ఉపాధి కార్మికులతో మాట్లాడుతున్న ఆశయ్య

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

- పాలడుగు సుధాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐదు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని యూనియన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలతోపాటు నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మేడ్చల్, శామిర్‌పేట, మూడు చింతలపల్లి మండలాల్లోని గ్రామాల్లో కార్మికుల సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికుల ఆందోళన, పోరాటాల ఫలితంగా సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపెడుతూ ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లిస్తుందని సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినట్టు గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల వేతనాలను ప్రభుత్వం విడుదల చేసినా.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఆయా మండలాల పరిధిలో పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించని పరిస్థితి ఏర్పడిందన్నారు. గతేడాది నవంబర్, డిసెంబర్ వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ ఏడాది మూడు నెలలు కలుపుకొని మొత్తం ఐదు నెలల వేతనాలు అందలేదని తెలిపారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శులు, ఎంపిఓలు, ఇన్‌చార్జి డిపిఓ, జిల్లా కలెక్టర్, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్, డిప్యూటీ కమిషనర్లకు విన్నవించినప్పటికీ పరిష్కారం లభించడం లేదన్నారు. దాంతో దిక్కుతోచని పరిస్థితుల్లో వేతనాలు చెల్లించాలని కార్మికులు నాలుగు రోజులుగా సమ్మె చేపట్టారని తెలిపారు. ఆదాయం కలిగిన జిపిల్లో గ్రామాల అభివృద్ధి, జనాభా పెరగటం వల్ల పంచాయతీ కార్మికుల పని కూడా పెరిగిందని తెలిపారు. పెరిగిన పనికి అనుగుణంగా తమ శ్రమను గుర్తించి వేతనాలు చెల్లించాలని ఆయా మండలాల్లో కార్మికులు పంచాయతీల సెక్రెటరీలకు విన్నవించిన నేపథ్యంలో ఏడాది కిందటి నుంచి ఆయా పంచాయతీల ఆదాయాన్ని బట్టి వేతనాలు పెంచి ఇస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న రూ.9,600కు గ్రామ పంచాయతీల ఆదాయం నుంచి కార్మికుల శ్రమను గుర్తించి పెంచిన వేతనాన్ని కలపాలని డిమాండ్ చేశారు. ఇందుకు విరుద్ధంగా ప్రభుత్వం నిర్ణయించిన వేతనాన్నే చెల్లిస్తామని, ఆదాయాన్ని బట్టి గతంలో నిర్ణయించిన వేతనాలు చెల్లించేది లేదని నేడు అధికారులు మాట దాట వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ కమిటీల తీర్మానంతో ఆమోదించుకున్న వేతనాలు చెల్లించే వరకు ఈ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికుల శ్రమను గుర్తించాలని, గ్రామ కమిటీల తీర్మానాన్ని గౌరవించి పాత పద్ధతిలో కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న పాలడుగు సుధాకర్

శ్రీచైతన్య అకాడమి-ఇన్ఫినిటీ లెర్న్ ఆత్రేయ ప్రారంభం

- నీట్ ఫలితాలు మెరుగుపర్చడమే లక్ష్యంగా ఫిజిక్స్ సెషన్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శ్రీచైతన్య అకాడమి-ఇన్ఫినిటీ లెర్న్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా నీట్ కోర్సు కోసం ఆత్రేయను ప్రారంభించాయి. ఇది డిజిటల్ టూల్స్‌తోపాటు రియల్ టైమ్ పనితీరు ట్రాకింగ్‌ను సమగ్రంగా అందిస్తుంది. నీట్ అభ్యర్థులకు ఎక్కువగా సవాల్‌గా నిలిచేది ఫిజిక్స్ సబ్జెక్టు. దీనిపై ప్రత్యేకంగా దృష్టి పెడుతుంది. పి2సిబిజడ్‌తో నీట్ కోచింగ్ ద్వారా ఫిజిక్స్ సెషన్లను రెట్టింపు చేస్తుంది. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇన్ఫినిటీ లెర్న్ సహ వ్యవస్థాపకురాలు, శ్రీచైతన్య గ్రూప్ సీఈవో, డైరెక్టర్ సుష్మ బొప్పన మాట్లాడుతూ ఆత్రేయ ద్వారా నీట్ కోచింగ్‌ను కొత్త దిశలో తీసుకెళ్లామని అన్నారు. వ్యక్తిగత గైడెన్స్‌కు ఆధునిక ఏఐ టెక్నాలజీని మిళితం చేయడం వల్ల విద్యార్థుల అభ్యాసాన్ని విప్లవాత్మంగా మార్చుతున్నామని చెప్పారు. నీట్‌లో టాప్ ఫ్యాకల్టీతో విద్యార్థుల ప్రగతికి తక్షణ పరిష్కారాలను అందిస్తామని వివరించారు. ఇది వారి ఎంబీబీఎస్ కలను నిజం చేయడంలో సహాయ పడుతుందని అన్నారు. నీట్ సంసిద్ధత అంటే కేవలం చదువు మాత్రమే కాదనీ, భావోద్వేగ స్థిరత్వం కూడా అవసరమని చెప్పారు. ఆత్రేయలో ఈ రెండింటినీ దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు ఏకాగ్రతతో, ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లేలా ప్రయత్నిస్తామన్నారు. ఇన్ఫినిటీ లెర్న్ వ్యవస్థాపక సీఈవో ఉజ్వల్ సింగ్ మాట్లాడుతూ అభ్యాసం అనేది ప్రయాణమని అన్నారు. టాప్ మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్లు సాధించడమే తమ లక్ష్యమన్నారు. ప్రతి విద్యార్థి శక్తివంతం చేసేందుకే ఈ మిషన్‌ను ప్రారంభించామని చెప్పారు. బలహీనంగా ఉన్న అంశాలను దృఢంగా చేయడంపై దృష్టి పెడతామని అన్నారు.

రచయిత శ్రీపాద శ్రీనివాస్‌కు ఉగాది పురస్కారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కథా రచయిత, సిఎల్పి కార్యాలయ సీనియర్ ఉద్యోగి శ్రీపాద శ్రీనివాస్ ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో విపంచి ఫౌండేషన్ ఆయనకు ఉగాది పురస్కారాన్ని ప్రకటించింది. ఈ నెల ఏడున హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే ఓ కార్యక్రమంలో శ్రీనివాస్‌కు పురస్కారం ప్రదానం చేయనున్నారు. వృత్తిరీత్యా కాంగ్రెస్ శాసనసభా పక్ష కార్యాలయంలో ఉద్యోగిగా సేవలందిస్తున్న శ్రీనివాస్ ప్రవృత్తిగా పలు కథలు,కథానికలు రచించారు. ఆయన రచనలు ఆకాశవాణిలో తరచుగా ప్రసారమవుతుంటాయి. ఉగాది పురస్కారానికి ఎంపికైన శ్రీనివాస్‌కు పలువురు ప్రముఖులు, భాషాభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

గీతంలో ప్రతిష్టాత్మక ఎస్-2025 అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ శనివారం ప్రతిష్టాత్మక ఎస్-2025 అవార్డుల ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మొత్తం 52 అవార్డులను గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య విభాగం-స్టూడెంట్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్ ప్రధానం చేశారు. పాఠ్యేతర కార్యకలాపాలు, క్రీడలు, సమాజ సేవ, నాయకత్వంలో అసాధారణ ప్రతిభ చూపిన విద్యార్థులను సత్కరించారు. వారితోపాటు ఉత్తమ సహాయ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్ సీసీ క్యాడెట్ల సహకారాన్ని గుర్తించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కెవిపిఎస్ నాయకులు

కులవివక్షపై ప్రత్యక్ష ప్రతిఘటనకు సిద్ధం

- జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నేటి ఆధునిక యుగంలో కూడా కొనసాగుతున్న దేశానికి పట్టిన చీడ కుల వివక్ష అంటరానితనాన్ని నిర్మూలించడానికి యువతరం సమైక్యంగా సన్నద్ధం కావాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాబు జగ్జీవన్ రామ్ 117 వ జయంతి సందర్భంగా బషీర్‌బాగ్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం కుల వివక్షపై ప్రతిఘటన పోరాటాలు అనే కరపత్రాన్ని సామాజిక ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఆయన కరపత్రాలను ఆవిష్కరించారు. 1955 పౌర హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం ప్రతీ నెలలో చివరి రోజు ప్రజలను చైతన్య పరచాల్సిన బాధ్యత గల ప్రభుత్వం దానిని విస్మరిస్తున్నదని విమర్శించారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసుల్లో ప్రధానమైన భాగం ప్రతి వారంలో ఒకరోజు కుల వివక్ష నిర్మూలన కోసం ప్రభుత్వ అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని తెలిపారు. రాష్ట్రంలో నేటికీ దేవాలయ ప్రవేశాలు లేని గ్రామాలున్నాయని పేర్కొన్నారు. బతుకమ్మ ఆడనీయకపోవడం, క్షవరం చేయకపోవడం రచ్చబండల మీద కూర్చోనియకపోవడం తదితర వివక్షా రూపాలు కొనసాగుతున్నాయని తెలిపారు.దీనికి వ్యతిరేకంగా కేవీపీఎస్ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో కుల వివక్ష పై అధ్యయనం నిర్వహించి, పూలే అంబేద్కర్ జయంతులను పురస్కరించుకుని ప్రత్యక్ష ప్రతిఘటన పోరాటాలకు సిద్ధమవుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగకు కరపత్రాన్ని అందించి మద్దతు తెలియజేయాలని కోరారు. వివిధ సామాజిక ప్రజాసంఘాల రాష్ట్ర నాయకులు చెన్నయ్య, మచ్చ దేవేందర్, పి శంకర్, ఆరెపల్లి రాజేందర్, పల్లెల వీరస్వామి, రుద్రవరం లింగస్వామి, వశపాక నరసింహ, గొల్లపల్లి దయానంద్, పోకల కిరణ్ వాణి, కేవీపీఎస్ నగర అధ్యక్షులు ఎం దశరథ్ తదితరులు పాల్గొన్నారు..

భారతీయ సంస్కృతికి ప్రతిబింబాలు పండుగలు

- జస్టిస్ లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి కల్చరల్

భారతీయ సంస్కృతికి ప్రతిబింబాలు పండుగలు అని అవి మనుష్యులు మధ్య స్నేహ బంధాలను పెంచుతాయని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయ మూర్తి జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి అన్నారు. నవ్య సాహితీ సమితి నవ్య నాటక సమితి నిర్వహణలోతెలుగు విశ్వవిద్యాలయం లోని ఎన్ టి ఆర్ కళా మందిరం లో జరిగిన విశ్వా వసు నామ ఉగాది వసంతోత్సవం కార్యక్రమాన్ని జస్టిస్ లక్ష్మీ నారాయణ లాంఛనం గా ఆరంభించారు అనంతరం ప్రముఖ కవి ఆచార్య ఫణీంద్ర రచించిన శ్రీ రామాయణ తా రావళి దృశ్య కావ్యం ఆవిష్కరించి మాట్లాడారు పద్య రూపంలో ఫణీంద్ర కన్నులకు కట్టినట్లు రామాయణం లోని అద్భుత ఘట్టాలు ఆవిష్కరించారు అని అభినందించారు సంస్థల అధ్యక్షుడు వెమరాజు విజయ కుమార్ స్వాగతం పలికిన సభలో తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య గౌరీ శంకర్ రాష్ట్ర ఖజానా మరియు లెక్కల శాఖ ఉప సంచాలకులు జి వసుంధర తదితరులు పాల్గొనగా కార్యదర్శి సుధారాణి నివేదిక సమర్పించారు హరనాథ్ బాబు,లక్ష్మి మానస కార్యక్రమం పర్యవేక్షణ చేశారు తొలుత నాట్య గురువు మాధవీ మాల శిష్య బృందం వాసంతిక నృత్య రూపకం కన్నుల పండుగగా ప్రదర్శించారు.